## క్లుప్తంగా

### ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో వరంగల్‌కు చెందిన శ్రీచంద్ర నృత్య కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శనివారం సాయంత్రం పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరిగింది. సిరిమలల చంద్రసీత బృందానికి చెందిన పలువురు చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

### కేబీఎన్ అధ్యాపకుడు విజయబాబుకు డాక్టరేట్



**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** కాకరపర్తి భావనారాయణ కళాశాల కామర్స్ విభాగ అధ్యాపకుడు టెక్కెం విజయబాబుకు ద్రవిడన్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్‌లోని పలు అంశాలపై సమర్పించిన పరిశోధనా పత్రానికి డాక్టరేట్‌ను లభించిందన్నారు. విజయబాబు కాకరపర్తి భావనారాయణ కళాశాలలో పలు హోదాల్లో పని చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కార్యనిర్వహక వర్గం విజయబాబును అభినందించారు.

### రేపు పోస్టల్ బ్యాలెట్ల తరలింపు

**పెనమలూరు:** పెనమలూరులో పోస్టల్ బ్యాలెట్‌లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గత కొద్ది రోజుల క్రితం ఉద్యోగులు వేశారు. మచిలీపట్నం పార్లమెంట్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మచిలీపట్నంకు తరలించారు. పెనమలూరు నియోజకవర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 3,220ను పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రరిచారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 3వ తేదీన భద్రతా చర్యలు తీసుకుని మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీకి తరలిస్తామని ఏఆర్‌ఓ ప్రసాద్ తెలిపారు.

### విద్యార్థినికి వైఎన్నార్ చారిటీస్ ఆర్థిక సాయం

**మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):** విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోగలరని వైఎన్నార్ చారిటీస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ 8వ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్ చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్ సమీపంలో ఉన్న పార్టీ డివిజన్ కార్యాలయంలో ఇంటర్ విద్యార్థిని వైష్ణవికి రూ.10 వేలు, బీఎస్సీ చదువుతున్న తేజకు రూ.10 వేలు కళాశాల ఫీజు నిమిత్తం జయప్రకాష్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, అమ్మ ఒడి పథకాల అమలుతో పాటుగా నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన చైతన్య, ఎం.బోసు, కిషోర్, తుమ్మల మల్లికార్జునరావు, ఎల్.శివ తదితరులు పాల్గొన్నారు.

# అంజనీపుత్రా నమోస్తుతే !

- ఘనంగా హనుమత్ జయంతి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** పవనసుతుడు వీరాంజనేయుని జయంతి వేడుకలు వన్‌టౌన్‌లో శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. వన్‌టౌన్‌లోని వైష్ణవాలయాలన్నింటిలోనూ కొలువై ఉన్న హనుమత్ ఆలయాల్లో స్వామికి పలు విశేష పూజలను నిర్వహించారు. ఆకుపూజలు, సిందూరార్చనలు, క్షీరాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, స్నపనాభిషేకాలు, హోమాలు, హనుమాన్‌చాలీసా పారాయణాలు, స్వామి వారి నగరోత్సవాలతో వన్‌టౌన్‌లోని ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. హనుమత్ ఆలయాలు తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ కిటకిటలాడాయి. స్వామి వారి జయంతిని పురస్కరించుకొని ఆయా ఆలయాలను అత్యంత రమణీయంగా అలంకరించారు.

**శాస్త్రోక్తంగా సామూహిక వ్రతాలు**

వన్‌టౌన్‌లోని శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో వేంచేసి ఉన్న శ్రీ సంకల్పసిద్ధి హనుమాన్‌కు శనివారం పలు ప్రత్యేక అర్చనలను నిర్వహించారు. ఉదయం ఐదు గంటలకు స్వామి వారికి ప్రాతఃకాల సహస్ర నామార్చనను వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అలాగే భక్తులతో నిరాకటంగా గోక్షీరాభిషేకాన్ని నిర్వహింపజేశారు. అదేవిధంగా స్వామి వారికి సామూహిక నాగవలీ, దళసహస్ర నామార్చన తదితర కార్యక్రమాలు జరిగాయి. అదేవిధంగా ఇస్కాన్ భక్త బృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, సామూహిక వ్రతాలను నిర్వహించారు. మధ్యాహ్నం రెండు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావులు పర్యవేక్షించారు.

**శ్రీవారి సన్నిధిలో పూజలు**

బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేంచేసి ఉన్న ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ ఉత్సవ మూర్తికి ప్రత్యేక తిరుమంజనం, ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక సహస్ర నామార్చనను నిర్వహించారు. హనుమాన్‌చాలీసా పారాయణాన్ని భక్తులు సామూహికంగా కొనసాగించారు. అలాగే ఆలయ అర్చకస్వాములు పీ శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

**కొత్త గుళ్ల ప్రాంగణంలో..**

కొత్తగుళ్ళ ప్రాంగణంలో వేంచేసి ఉన్న ఆంజనేయ స్వామివారికి విశేష పూజలను నిర్వహించారు. ఆలయంలో ఉన్న రజిత హనుమత్ వాహనంపై కోదండరామునికి శాంతి కల్యాణాన్ని జరిపారు. అలాగే స్వామి వారికి కోదండరామాలయంలో స్వామివారికి తిరుమంజనం, లక్ష తమలపాకులతో అర్చనను నిర్వహించారు. కార్యక్రమాలను పులిపాక ఆంజనేయాచార్యులు, రాఘవాచార్యులు నిర్వహించారు.



విజయదుర్గా ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు



మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో స్వామివారు



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**పంచముఖ ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో..**

కేటీ రోడ్డులో వేం చేసి ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో స్వామి వారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు అనంతరం విశేష అలంకరణ చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయంలో స్వామి వారి సంకీర్తన రాత్రి వరకూ కొనసాగింది.

**చిట్టినగర్ వ్యాప్తంగా..**

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** హనుమత్ జయంతిని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీహనుమత్ దీక్షా పీఠంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తమల పాకుల అర్చన, విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. హనుమత్ జయంతిని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన పలువురు భక్తులచే పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ దీక్షలు విరమించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది.

**కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో..**

వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామివారి ఆలయంలో పంచామృత అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హనుమత్ వ్రతాన్ని ఆచరించగా, 45 మంది దంపతులు స్వామివారి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులు, ఉభయదాతలతో పాటు దాతలు చింతలపూడి సత్యనారాయణ, కుంచెం శ్రీనివాసరావు, హరిహర అయ్యప్ప సేవా సమితి సభ్యుల సహకారంతో ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రావూరి వెంకటేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు ఖండపల్లి త్రినాథ ఆచార్యులు, పవన్‌కుమార్ ఆచార్యులు, విన్నకోట శ్రీనివాసశర్మ పూజా కార్యక్రమాలను జరిపించగా, దేవస్థాన కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, ఇతర పాలక వర్గ కమిటీ సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

### దుర్గమ్మ సన్నిధిలో..

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం హనుమత్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడైన అభయ వీరాంజనేయ స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించారు. ఘాట్‌రోడ్డులోని స్వామి వారి ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద, పాత మెట్ల మార్గంలోని స్వామి వారి ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, తమలపాకులతో అర్చనను ఆలయ అర్చకులు చేశారు. దేవస్థాన వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో స్వామి మూలమంత్ర జపం, మూల మంత్ర హవనం, మాన్యుసూక్త పారాయణ, సుందర కాండ పారాయణ జరిగింది. అనంతరం ఘాట్‌రోడ్డులోని ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో ఉభయ దాతలు, భక్తులు దర్శించుకుని పూజా కార్యక్రమాలను జరిపించుకున్నారు.



ఇంద్రకీలాద్రిపై హోమం నిర్వహిస్తున్న అర్చకులు

**విజయదుర్గా ఆలయంలో..**

భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చన, తమల పాకులతో విశేష పూజ నిర్వహించారు. స్వామి వారికి లక్ష తమలపాకులతో అర్చన నిర్వహించినట్లు ఆలయ అర్చకుడు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పేర్కొన్నారు. స్వామి వారికి పలువురు భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. స్వామి వారికి విశేష పూజల అనంతరం పంచహారతుల సేవ నిర్వహించగా, పెద్ద ఎత్తున ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

**రాయప్ప రాజు వీధిలో..**

శ్రీశ్రీశ్రీ దాసాంజనేయ స్వామి వారి మందిరంలో హనుమత్ జయంతి వేడుకలను నిర్వహించారు. స్వామివారికి తెల్లవారుజామున పంచామృత అభిషేకం, తమలపాకుల అర్చన, హనుమత్ హోమాన్ని ఆలయ అర్చకుడు శ్రీనివాసశర్మ నిర్వహించారు. హోమంలో ఆలయ నిర్వహకులు శ్యామ్‌రాజ్, దుర్గారావు దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు అన్న ప్రసాద పంపిణీ జరిగింది.

**మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో..**

చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం ప్రాంగణంలోని శ్రీ వీరాంజనేయ స్వామి వారికి అభిషేకాలు, తమలపాకులతో పూజ నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున ఉభయ దాతలు, భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ, కార్యవర్గ సభ్యులు, కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని, పూజలు చేశారు.

**విద్యాధరపురం చెరువు సెంటర్‌లో..**

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని శ్రీసువర్చలా సహిత ప్రసన్నాంజనేయ స్వామివారి దేవస్థానంలో గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు తలపెట్టిన హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి ప్రాతఃకాల అర్చన, మన్యుసూక్తం, రుద్ర నమక చమకాలతో 108 పంచామృత గోక్షీర, ఫలసహిత కలశాలతో అభిషేకం, అనంతరం స్వామివారికి ఆకుపూజ, అలంకరణ, మంత్ర పుష్పం భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఆ తరువాత భక్తులతో సామూహిక సింధూరార్చన, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయని, ఆ రోజు ఉదయం 10 గంటలకు సకల దేవతా శాంతి హోమాలు, పూర్ణాహుతి, ఆశీర్వచనం, తీర్థప్రసాద వితరణ జరుగుతాయని, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం వైభోపేతంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలను దేవస్థానం కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.వి.రమణ రాజు, సెక్రటరీ కామయ్య శాస్త్రి, సహాయ కార్యదర్శులు నరసరాజు, నారిండి కిషోర్ కుమార్, సభ్యులు ఎస్ మునసబు, ఎన్ రామారావు, ఉప్పలపాటి ప్రసాదరాజు, కుండనాల నాగు తదితరులు నిర్వహించారు.



శ్రీ కృష్ణ ప్రార్థనా మందిరంలో..



వేంకటేశ్వరస్వామి సన్నిధిలో తిరుమజనం



కొత్తగుళ్లు ప్రాంగణంలో రజిత హనుమత్ వాహనంపై కోదండరాముడు



పూజలందుకున్న ప్రసన్నాంజనేయ స్వామి

## ఆలయాల్లో భక్తులకు అన్నసంతర్పణ

**కృష్ణలంక(విజయవాడతూర్పు):** కృష్ణలంక ప్రాంతంలోని పలు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాత పోస్టాఫీస్ రోడ్డులోని శ్రీ కోదండ రామాలయం, ఫీడర్ రోడ్డులోని అండర్ పాస్ వద్ద రామాలయం, నల్లగేటు డౌన్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, రాణిగారితోటలోని శ్రీ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. అభయాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి ఆలయ అర్చకులు ఆకు పూజ, అర్చనలు, హనుమాన్ చాలీసా నిర్వహించి స్వామివారి కల్యాణాన్ని కనుల పండుగగా జరిపించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. 3 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ధనుంజయ బాబు, బలరాం, గణేష్, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు. రాణిగారితోటలోని కోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. తొలుత ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, కార్యదర్శి బిక్షాలురెడ్డి, కోశాధికారి చెంచయ్య, కార్పొరేటర్లు తంగిరాల రామిరెడ్డి, తాటిపర్తి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలపై ఐజీ సమీక్ష

**పెనమలూరు:** పెనమలూరు పోలీస్‌స్టేషన్‌ను ఐజీ అశోక్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఓట్ల కౌంటింగ్ సందర్భంగా పెనమలూరు నియోజకవర్గ పరిధిలో శాంతి భద్రతల పర్యవేక్షించేందుకు ఆయన నియోజకవర్గ పరిధిలో పర్యటించారు. అనంతరం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. బందోబస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్పీ రజిని, ఇన్‌చార్జి డీఎస్పీ శుభాష్, సీఐలు టీవీ వీ.రామారావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, ఎండీ హబీబ్‌బాషా, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడాకారులకు హాకీ స్టిక్స్, బాల్స్ పంపిణీ

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** సింగ్‌నగర్ ఎంబీ స్టేడియంలోని హాకీ క్రీడాకారులకు సీనియర్ హాకీ ప్లేయర్ బి.హేమంత్‌కుమార్ హాకీ స్టిక్స్, బాల్స్ పంపిణీ చేశారు. వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమం స్టేడియం ఆవరణలో శనివారం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన ముందుగా సమ్మర్ క్యాంపు ఆడిన పిల్లలందరికి స్టిక్స్, బాల్స్ అందజేశారు. అనంతరం హేమంత్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటల్లో కూడా చిన్నారులు రాణించాలని సూచించారు. తమకు ఆసక్తి కలిగిన రంగాలపై చిన్నారులు పట్టు సాధిస్తే చక్కని ఫలితాలు వస్తాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో కూడా ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. ఏ క్రీడలో అయినా ప్రత్యేక శిక్షణ తీసుకొని, నిరంతరం క్రమశిక్షణతో సాధన చేస్తే తప్పకుండా విజయాలు సాధించవచ్చని పేర్కొన్నారు. ఎంబీ స్టేడియం అజిత్‌సింగ్‌నగర్ హాకీ కోచ్ కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

## • లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ



21వ డివిజన్‌లో అప్పల నాయుడుకు పెన్షన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది హరికిరణ్



రాణిగారితోటలో నాగరత్నంకు వృద్ధాప్య పెన్షన్ అందజేస్తున్న ప్లానింగ్ సెక్రటరీ దుర్గారావు

నగరంలో శనివారం వైఎస్సార్ పెన్షన కానుక – సామాజిక భద్రతా పెన్షన్లను సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. నడవ లేని, మంచానికే పరిమితమైన లబ్ధిదారుల ఇళ్లకు సచివాలయ సిబ్బంది వెళ్లి నగదును అందజేశారు. మిగతా పింఛన్‌దారులకు వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

## చాలీసా పారాయణం సర్వపాప హరణం

**విజయవాడకల్చరల్:** హనుమాన్ చాలీసా పారాయణం సర్వపాపహరణమని భువనేశ్వరీ పీఠాధిపతి కలమలానంద భారతీస్వామి అనుగ్రహ భాషణ చేశారు. జయహో భారతీయం ఆధ్వర్యంలో సంగీత కళాశాలలో హనుమజ్జయంతి సందర్భంగా నిర్వహించిన హనుమాన్ చాలీసా మహా పారాయణం కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. స్వామీజీ మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణం కుల మతాలకు అతీతంగా చేయవచ్చునని సూచించారు. చాలీసాలో హనుమంతుని గుణగణాలు, బలం, భక్తి తత్వం కనిపిస్తాయన్నారు. ప్రతి ఇంటిలోనూ నిత్యం పారాయణం చేయాలని సూచించారు. హనుమత్ భక్తి తత్వం ప్రచారకులు, హనుమత్ ఉపాసకులు ఎమ్ఎస్ శ్రీనివాసరావు హనుమాన్ చాలీసాను మధురంగా గానం చేశారు. ఋత్వికులు మంగళంపల్లి బాబి శర్మ, జొన్నలగడ్డ భాను శర్మ, మేడూరి శాంతి కిషోర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన హనుమత్ విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు. నాగవల్లి, సిందూర పూలతో అర్చించారు. వల్లీశ్వర్, శ్రీనివాస రెడ్డి, యాబలూరి లోకనాథ శర్మ, కామేశ్వర శర్మతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

## • జై శ్రీరామ్.. జై హనుమాన్



బైక్ ర్యాలీలో పాల్గొన్న భక్తులు



పాదయాత్రగా వస్తున్న శివస్వామి తదితరులు



కోలాటం ఆడుతున్న చిన్నారులు

హనుమత్ జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మహానగర్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన బైక్ ర్యాలీ వైభవోపేతంగా జరిగింది. భారత్ మాతాకు జై, జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో పరిసరాలు మార్మోగాయి. బీఆర్టీఎస్ రోడ్డులోని శివరామ కృష్ణ క్షేత్రం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి తనికెళ్ల సత్యరవి కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయులందరూ మాతృమూర్తుల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సుదీర్ఘ పోరాటం వల్ల అయోధ్యలో రామమందిరం నిర్మాణం కల సాకారమైందని చెప్పారు. కేవలం అది నిర్మాణం మాత్రమే కాదని కోట్లాది భారతీయుల కోరిక అని అభివర్ణించారు. హనుమంతునిలోని సేవా గుణం, కార్యదక్షతను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తాళ్లయపాలెం శైవపీఠాధిపతి శివస్వామి ర్యాలీని ప్రారంభించారు. రామకోటి నుంచి ప్రారంభమైన ర్యాలీ బీఆర్టీఎస్ రోడ్డు, మీసాల రాజారావు వంతెన, సత్యనారాయణ పురం వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ, నాగలింగం శివాజీ, విశ్వహిందూ పరిషత్ బాధ్యులు దుర్గాప్రసాద్, రాఘవరాజు, కె.రామకృష్ణ, సానా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





బైక్ ర్యాలీలో మేము సైతం..

– విజయవాడకల్చరల్

**5న పూజలు, అభిషేకాలు**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 5వ తేదీ బుధవారం మాసశివరాత్రిని పురస్కరించుకుని మరకత పోలిక శ్రీభవానీ శంకరస్వామివారికి విశేషంగా అభిషేకం, అర్చనలు నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.